న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు



కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి జిల్లా ప్రజలకు ఒక ప్రకటన ద్వారా దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన దీపావళి అంటే చీకటిపై కాంతి, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయంగా పేర్కొన్నారు. ఈ పండుగను ప్రజలు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో ఆనందంగా, జాగ్రత్తగా జరుపుకోవాలని సూచించారు.

ఎస్పీ శుభాకాంక్షలు

కడప అర్బన్: ఆర్‌జిల్లా ప్రజలకు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ దీపావళి పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈనెల 20న జిల్లా పోలీస్ కార్యాలయంలో జరగబోయే ' ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'ను రద్దు చేసినట్లు ఎస్పీ ఆదివారం తెలిపారు.

కొనసాగుతున్న వర్షాలు



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో ఐదు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. అట్లూరులో 19.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. గోపవరంలో 17.2, కాశినాయనలో 15.2, బద్వేల్‌లో 13.6, కడపలో 11.8, బి.కొడూరులో 10.4, ఒంటిమిట్టలో 8.6, కలసపాడులో 8, సిద్దవటంలో 7.4, చెన్నూరులో 7.2, బిమఠంలో 6.2, దువ్వూరులో 5.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ సస్పెన్షన్



హృషీకేశవరెడ్డి

కొండాపురం: తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న హృషీకేశవరెడ్డిని సస్పెండ్ చేస్తూ శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ కోయప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని టి. కోడూరు గ్రామ సమీపంలో ఉన్న సోలార్ కంపెనీలో రూ.కోట్ల విలువైన పరికరాల చోరీకి సంబంధించి కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించారని ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిడితో కేసును నిర్వీర్యం చేశారని ఆరోపణలు రావడంతో అధికారులు మందలించారు. దీంతో రెండునెలల కిందట హృషీకేశవరెడ్డి సెలవుపై వెళ్లారు. సోలార్ కంపెనీకి రైతులు భూములు ఇచ్చేలా సంతకాలు చేయించారని కూడా ఆరోపణలు ఉన్నాయి. అనంతరం విచారణ చేపట్టగా వాస్తవమని తేల్చి అందిన నివేదక ఆధారంగా డీఐజీ చర్యలు తీసుకున్నారు.

అప్రమత్తతతో ఆనంద దీపావళి

- చిన్నపాటి జాగ్రత్తలతో సంతోషాల హరివిల్లు
- రసాయనాలతో ముప్పు పొంచి ఉందంటున్న వైద్యులు



మున్సిపల్ మైదానంలో టపాసులను తీసుకెళుతున్న ప్రజలు



కడప కోటిరెడ్డిసర్కిల్: దీపావళి అంటేనే సందడి, చిచ్చుబుడ్లు నుంచి బాంబుల వరకు మోత మోగాల్సిందే. అయితే మనం కాల్చే టపాసుల్లో ఉన్న రసాయనాలు వాతావరణానికి తీరని నష్టాన్ని కలిగిస్తాయన్న విషయాన్ని విస్మరించరాదు. అందుకే కాలుష్యం నింపి పర్యావరణాన్ని నష్టం కలిగించేలా కాకుండా పర్యావరణ హితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. పండుగ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.

గాలి, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉండాలి

భారీ శబ్దాలు, రసాయనాలు వెలువరించే బాణసంచా స్థానంలో మట్టి దీపాలు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలు వెలిగించాలి. నెయ్యి దీపాలను వెలిగించడం వల్ల ఆక్సిజన్ కూడా ఎక్కువగా వెలువడుతుంది. గాలి, శబ్ద కాలుష్యం నివారించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయి. టపాసుల తయారీలో కాపర్, కాడ్మియం, లెడ్, అమ్మోనియం, నైట్రోజన్ ఆకె్డ్, సల్ఫర్ డయాక్సైడ్, సోడియం, మెర్క్యురీ, లిథియం, పొటాషియం వంటి అనేక మిశ్రమాలు వాడతారు. వీటి నుంచి వచ్చే వెలుగులతో కన్ను, ఘాటు వాసనతో ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడతాయి.

ప్రమాదాలు తలెత్తితే...

టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 108 టోల్ ఫ్రీ నంబరుతోపాటు అగ్నిమాపకశాఖ కార్యాలయాలను వెంటనే సమాచారం ఇవ్వాలి.

అగ్నిమాపక కేంద్రం	ఫోన్ నంబరు
డీఎఫ్ఓ ఆఫీసు, కడప	08562-241739
కడప	08562-242299
ప్రొద్దుటూరు	08564-252999
జమ్మలమడుగు	08560-270099
పులివెందుల	08568-286177
కమలాపురం	08563-274250
బద్వేలు	08569-284099
మైదుకూరు	8790201101
పోరుమామిళ్ల	9963737637
వేంపల్లె	94417 68101

హద్దులు దాటితే అనర్థమే

- టపాసుల్లో టాక్సిక్ కారకాలైన రాగి, కాడ్మియం, సీసం, మెగ్నీషియం, జింక్, సోడియం, పొటాషియం, గంధకం వంటి పదార్థాలు ఉండడంతో శ్వాస కోస వ్యాధులకు కారణమవుతాయి. ముఖ్యంగా భూ చక్రాలు, పాము మాత్రలు, మతాబులు, చిచ్చుబుడ్లు వల్ల అధికంగా పొగ వ్యాపిస్తుంది.
- టపాసులు పేల్చినపుడు వెలువడే ధ్వని అపరిమితంగా ఉంటుంది. బాణసంచా కాల్చేటపుడు 125 నుంచి 130 డెసిబుల్స్ శబ్దం వెలువడుతుంది. సాధారణంగా మనిషి వినికిడి శక్తి 50 డెసిబుల్స్ మాత్రమే. అంతకు మించి శబ్దాలను వింటే చెవికి నష్టం తప్పదు. కొందరు వినికిడి సమస్యల బారిన పడతారు. మరికొందరు అతి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ టపాసులను కాల్చుతూ ప్రమాదాలను కొని తెచ్చుకుంటారు. ఈ పరిస్థితులు రాకుండా జాగ్రత్తలతో దీపావళిని జరుపుకోవాలి.

కాలుష్య రహిత దీపావళి అందరి బాధ్యత: జిల్లా కలెక్టర్ శ్రీధర్

కడప సెవెన్‌రోడ్స్: భవిష్యత్తరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని, కాలుష్య రహిత ప్రకృతిని అందించాలంటే దీపావళి రోజున కొన్ని జాగ్రత్తలు, నియంత్రణలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా పటాకులు కాల్చడం వల్ల వాయు కాలుష్యం స్థాయి పెరుగుతోందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆలోచించి మనందరి బాధ్యతగా విధిగా కొన్ని విధానాలను, అనుసరించాలన్నారు. పర్యావరణహితమైన గ్రీన్ టపాసులనే వాడాలన్నారు.ఎక్కువ పొగ, ఎక్కువ శబ్దం వచ్చే వాటికి దూరంగా ఉండాలన్నారు. వెలుగులు జిమ్మే మతాబులు, చిచ్చు బుడ్లను ఎంచుకోవాలని, అర్ధరాత్రి దాకా కాకుండా కొంత సమయానికే మనల్ని మనం నియంత్రించుకోవాలన్నారు. ఇరుకు రోడ్లు, బాల్కనీల్లో కాకుండా, కాస్త విశాలమైన ప్రదేశాల్లో టపాసులు కాల్చుకోవాలని సూచించారు. టపాసులు కాల్చాకర చేతులను, కాళ్లు, ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలన్నారు. శీతాకాలం, పైగా కాలుష్యంతో శ్వాస కోస సమస్యలొచ్చే ప్రమాదం ఉంది. అందుకే అందరూ విధిగా మాస్క్ లను ధరించాలని సూచించారు.



కడపలోని మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేసిన స్టాల్



ప్రమిదలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

జాగ్రత్తలు తప్పనిసరి



- లైసెన్స్ ఉన్న దుకాణాల వద్ద బాణాసంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణాసంచా కాల్చాలి
- విద్యుత్ తీగల కింద నిలబడి టపాసులు కాలచ్చరాదు. కాటన్ దుస్తు లను ధరించాలి.
- కాకర పువ్వొత్తులు కాల్చిన వెంటనే వాటిని ఆర్పేందుకు సమీపంలో నీళ్ల డబ్బాలను ఉంచుకోవాలి.
- ఆరుబయట దీపావళి మందులు కాల్చాలి
- ఆస్పత్రుల సమీపంలో, పెట్రోలు బంకులు ఉన్న ప్రాంతాల్లో కాల్చరాదు.
- విధిగా పాదరక్షలు ధరించాలి. అందుబాటులోన నీళ్లు పెట్టుకోవాలి.
- బాణసంచా కాల్చినపుడు గాయాలైతే వెంటనే చల్లని నీరు పోస్తే ఇన్నర్ లేయర్ కాలుద. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.
- పేలని టపాసుల వద్దకు వెళ్లి తొంగి చూడరాదు.
- చేతుల్లో బాంబులు పేల్చడం హానికరం.
- గుడిసెలు ఉన్న ప్రాంతంలో తారాజువ్వలు వేయరాదు
- జేబుల్లో బాణసంచా పెట్టుకోకూడదు
- విద్యుత్ బల్బులు, డెకరేటివ్ బల్బులు అధికంగా పెట్టరాదు. వీటివల్ల షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

రసాయనాలతో ప్రమాదం



దీపావళి టపాసులు కాల్చినపుడు వెలువడే రసాయనాలతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. టపాసులు కాల్చే సమయంలో వచ్చే వెలుగు కంటిచూపును, వెలువడే ఘాటు వాసనలు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి. కంటి అద్దాలు వాడాలి. – కరుణాకర్, వైద్య నిపుణులు, కడప

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి



దీపావళి రోజున బాణసంచా నుంచి వెలువడే పొంగ నుంచి గర్భిణులు, బాలింతలు దూరంగా ఉండాలి. బిడ్డకు ఆక్సిజన్ స్థాయి తగ్గి అపస్మారక స్థితికి చేరే ప్రమాదం ఉంది. ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్య ఉత్పన్నమైతే వైద్యులను సంప్రదించాలి. – పావని, స్త్రీ వైద్య నిపుణులు, కడప

ప్రజాస్వామ్యం.. అపహాస్యం



ప్రభుత్వ వైఫల్యాలు,అవినీతిని నిలదీస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని నాయకులు, పాత్రికేయులు, వివిధ వర్గాల నేతలు మండిపడుతున్నారు.

ఇది పత్రికా స్వేచ్ఛపై దాడే



సాక్షి మీడియా జర్నలిస్టులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం దారుణం. నెల్లూరులో నకిలీ మద్యం తాగి ముగ్గురు వ్యక్తులు చనిపోయారని వార్తలు రాసినందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయం. నోటీసుల పేరుతో సాక్షి కార్యాలయాల వద్దకు వెళ్లి పోలీసులు హంగామా సృష్టించడం అప్రజాస్వామికం. మీడియా గొంతునొక్కే ప్రయత్నం చేయడం సరికాదు. ఇలాంటి చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. –షేక్ ఉమైర్, ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం

ప్రశ్నించే గొంతును నొక్కేస్తారా?




ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సాక్షి మీడియాపై, రిపోర్టర్లపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రశ్నించే పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం సరికాదు. అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలి. –లక్షుమయ్య, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అప్రజాస్వామికం



పత్రికలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటివి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నారనే కక్షతో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, పాత్రికేయులపై అక్రమకేసులు పెట్టడం అప్రజాస్వామికం. తక్షణమే వీటిని రద్దుచేయాలి. – ధ్వజారెడ్డి, వైఎస్ఎంపీపీ, రైల్వేకోడూరు

యమ డ్రింకరులు



- జిల్లాలో పెరుగుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- మద్యం మత్తులో రోడ్డు ఎక్కడంతో ప్రమాదాలు
- శిక్షలు పడుతున్నా యువతలో కనిపించని మార్పు

- ఇటీవల ఊటుకూరు రింగ్ రోడ్ సర్కిల్ వద్ద అతివేగంగా బైక్ నడుపుతూ యువకుడు అదుపుతప్పి కింద పడ్డాడు తలకు తీవ్ర గాయమైంది.చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తున్న సమయంలో మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయాడు. అయితే అతిగా మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడపడమే ప్రమాదం కారణంగా తేలింది.
- కొన్ని రోజుల క్రితం కడప నగర శివారులో మద్యం మత్తులో యువకుడు వాహనం అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించాడు.

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో రోజు ఎక్కడో ఒకచోట మద్యం మత్తులో ప్రమాదాలు చోటుచేసుకుని మరణాలు సంభవిస్తున్నాయి. మద్యం తాగడం ఎంత హానికరమో వివరించే ప్రచార చిత్రాలు చాలా చోట్ల కనిపిస్తుంటాయి. పోలీసులు కూడా వివిధ ప్రచారాల మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఇవి మద్యం ప్రియుల్లో మార్పు తీసుకురాలేకపోతున్నాయి. పండుగలు ఉత్సవాలు శుభకార్యాల పేరుతో మందుబాబులు తెగ తాగేస్తున్నారు. అదే సమయంలో వాహనాలతో రోడ్లపైకి రావడం ముప్పు తెస్తోంది. ఇటీవల పోలీసులు చేపట్టిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 20 నుంచి 35 సంవత్సరాల మధ్య యువకులే అత్యధికంగా పట్టుబడటం గమనార్హం . 40 నుంచి 55 సంవత్సరాలు వయసు వారు తర్వాత స్థానంలో ఉన్నారు. ఇటీవల 18 నుంచి 22 సంవత్సరాల మధ్య వయసు వారు కూడా అధికంగానే మద్యం తాగి తనిఖీల్లో పట్టుబడుతున్నట్లు పోలీసుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

ఆధారపడ్డ వారు అంధకారంలో...

మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదకరమని జిల్లాలో నిత్యం ఎక్కడో ఒక చోట పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా వీటిని యువత లెక్క చేయడం లేదు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ చివరకు తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు. వారిపై ఆధారపడిన వారిని అంధకారంలోకి నెట్టేస్తున్నారు. జిల్లాలో ఏటా డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెరుగుతూనే ఉన్నాయి. దొరికిన కొందరు కొన్ని రోజులపాటు జైలు శిక్ష అనుభవించి, బయటకు వచ్చిన తర్వాత తిరిగి తమ పంథాను కొనసాగిస్తుండడం గమనార్హం. జిల్లాలో రెండు సంవత్సరాల్లో 818 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు కావడమే ఇందుకు నిదర్శనం.

- మద్యం తాగి వాహనం నడుపును చట్టరీత్యా నేరమని అందరికీ తెలిసిన విషయమే. మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాలు జైలు శిక్ష వేస్తారని కూడా మందుబాబులు తెలుసుకోవాలి. మొదటిసారి పట్టుబడితే రూ.10 వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండోసారి అదే తప్పు చేస్తే రూ.15 వేల జరిమానా రెండు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. ఇలాంటి ఘటనలో ఎవరికైనా ప్రాణాపాయం కలిగితే ఇతరులు మృత్యువాత పడితే ఐదేళ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. జరిమానా కూడా భారీగానే ఉంటుంది. ఒకవేళ మృతి చెందిన వ్యక్తి మరణానికి ప్రమాదం చేసిన వ్యక్తి సరైన కారణం చెప్పకపోతే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు అదనంగా కఠిన మైన శిక్షలు విధించేలా చట్టాన్ని మార్చారు.

కఠిన శిక్షలు..



మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం. ప్రమాదానికి గురైతే కుటుంబీకులు ఇబ్బంది పడతారనే విషయాన్ని విస్మరించరాదు. కంటి ముందే ఎన్నో దుర్ఘటనలు జరుగుతున్నా చాలామందిలో మార్పు రావడం లేదు. విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని కౌన్సెలింగ్‌లో సూచిస్తున్నాం అంతేకాక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుపడితే కఠిన శిక్షలు ఉంటాయి. – వీర్రాజు, జిల్లా ఇన్‌చార్జి ఉపరవాణా కమిషనర్

నూతన కార్యవర్గం ఎన్నిక

కడప ఎడ్యుకేషన్: ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ ఎస్వీ రమణరాజు ఆధ్వర్యంలో కడపలో ఉమ్మడి కడప జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పులివెందుల వైఎస్‌వీఆర్ఎం బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులను డిస్ట్రిక్ ప్రెసిడెంట్‌గా, ఎర్రగుంట్ల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డిని సెక్రటరీగా, పోరుమామిళ్ల కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డిని వైస్ ప్రెసిడెంట్‌గా, మైలవరం కళాశాల ప్రిన్సిపాల్ నాగభూషన్‌రెడ్డిని జాయింట్ సెక్రటరీగా, తొండూరు కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌రావును ట్రెజరర్‌గా, నందలూరు ప్రిన్సిపాల్ శ్రీదేవిని మహిళా సెక్రటరీగా, వేంపల్లె ప్రిన్సిపాల్ రవిని స్టేట్ కౌన్సిలర్‌గా ఎన్నుకున్నారు.

క్లుప్తంగా

మేనమామ వేధింపులపై విచారణ

కైకలూరు : మేనమామ వేధింపులు, తల్లి, అమ్మమ్మ, తాత చితకబాదిన ఘటనలో బాధిత బాలిక నుంచి కైకలూరు రూరల్ పోలీసులు ఆదివారం వివరాలు సేకరించారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం చటాకాయి గ్రామానికి చెందిన జయమంగళ కుమార అభిమన్యు మొదటి భార్య కుమార్తె (14)ను ఆమె తల్లి కామాక్షి గత నెల 26న వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మండలం అల్లూరి పంచాయతీ అగ్రహారం తీసుకువెళ్లారు. అక్కడ బాలికను తల్లి, అమ్మమ్మ, తాత విపరీతంగా కొట్టడంతోపాటు తండ్రి వద్దకు పంపాలంటే.. మేనమామ ఉమాశంకర్ లైంగిక కోరిక తీర్చాలని బలవంతం చేశారని బాలిక పోలీసులకు చెప్పినట్టు సమాచారం. దీంతో కైకలూరులో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు బాలిక తల్లి కామాక్షి, అమ్మమ్మ మోరు నాగులమ్మ, తాత వెంకటరమణ, మేనమామ ఉమాశంకర్‌లను దోషులుగా చేర్చి రిపోర్టును పంపారు. బాలిక మైనర్ కావడంతో పోక్సో కేసు నమోదు చేసే అవకాశం ఉందని స్థానిక పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలను బద్వేలుకు పంపారు. అక్కడ పూర్తి విచారణ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని పోలీసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన బాలయ్య

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో మండలంలోని పందిళ్లపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చాపాడు మండలం నెరవాడకు చెందిన గొర్ల బాలయ్య (50) మృతి చెందాడు. 108 సిబ్బంది సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలయ్య ఎర్రగుంట్లకు వెళ్లి పనులు చూసుకుని తిరిగి కమలాపురం మీదుగా చాపాడుకు వెళ్లేందుకు తిరిగి వస్తున్న నేపథ్యంలో.. పందిళ్లపల్లె వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ఘటనలో బాలయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం ఇతర ఆసుపత్రికి రెఫర్ చేశారు. అయితే ఇతర ఆసుపత్రికి వెళ్తుండగానే మృతి చెందాడు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరుకు చెందిన చాంద్‌బాషా భార్య ఆయేషా(30) కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐసీయూ విభాగంలో చికిత్సలు అందించారు.

రైలు కింద పడి వ్యకి మృతి



కడప కోటిరెడ్డిసర్కిల్ : ఒంటిమిట్ట–భాకరాపేట రైల్వేస్టేషన్ మధ్య ఆదివారం రైలు కింద పడి ఒక వ్యక్తి మృతి చెందాడని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు శివశరత్ చౌదరి(30)గా గుర్తించామని, ఇతను రాజంపేట పట్టణం నూనెవారిపల్లెకు చెందిన వాడిగా తెలిసిందన్నారు. అతను నేషనల్ హైవేస్ అథారిటీస్‌లో తాత్కాలిక ఉద్యోగిగా పని చేస్తుండేవాడన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ ప్రియులు

కడప సెవెన్‌రోడ్స్ : మహాదాత బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి రచించిన బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ కార్యక్రమం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ డొక్కల కరువులో తిండి లేక వేలాది మంది రాయలసీమ ప్రజలు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. అలాంటి సమయంలో బుడ్డా వెంగళరెడ్డి కొన్ని వేల మందికి కొన్ని నెలల పాటు అంబలి పోసి ప్రాణాలు కాపాడారన్నారు. ఆయన దాతృత్వం, సేవల గురించి భావితరాలకు తెలియజెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కడపలో ఆయన విగ్రహ ఏర్పాటుకు అందరూ ముందుకు రావాలని, తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం, ఆయన చరిత్ర గురించి పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. అలాగే ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు పెట్టాలన్నారు. ఇందువల్ల భావి తరాలు ఆయన గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందేందుకు వీలుంటుందన్నారు. ఈ విషయాన్ని తాను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

వర్సిటీలు పరిశోధనలు జరపాలి

రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలతోపాటు ఎందరో మహనీయుల సేవలు, త్యాగాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేపట్టాలని అన్నారు. వారి జీవితం, సేవల గురించి ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నందన, డొక్కల, ధాతు వంటి భయానక కరువుల్లో రాయలసీమ ప్రజలు అనుభవించిన ఆవేదన, కన్నీళ్లు, అవమానాలు లాంటి అంశాల గురించి బ్రిటీషు గెజిటీర్లు, చరిత్ర పుస్తకాల్లో లేవన్నారు. ఆ విషయాలను చరిత్ర పరిశోధకులు వెలుగులోకి తీసుకు రాగలిగితే రాయలసీమ యువత ఈ ప్రాంత అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ముందుకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

ఘనంగా సన్మానం

పుస్తక రచయిత దస్తగిరి, బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కవి కర్నాటి రామకృష్ణారెడ్డి, పుస్తక సమీక్షకులు జీవీ సాయిప్రసాద్, రెడ్డి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మప్రియ చంద్రారెడ్డి, యూ ట్యూబర్ దండా ప్రసాద్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త దేసు వెంకటరెడ్డి, కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు మోపూరి బాలకృష్ణారెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, నగర ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మానవత సంస్థ ప్రతినిధులు డాక్టర్ రామాంజులరెడ్డి, ఆచార్య సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన ఎమ్మెల్సీ

- రామసుబ్బారెడ్డి స్పందనపై ప్రజల్లో హర్షం
- పనులు ఎందుకు చేశారంటూ ప్రశ్నించిన పోలీసులు
- స్థానిక నేతలను అక్కడి నుంచి పంపించిన వైనం



వైఎస్సార్‌సీపీ నేతలు పూడ్చిన గుంత, దెబ్బతిన్న రోడ్డు వద్ద నుంచి డీఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం నెమళ్లదిన్నె కుందూ నదిపై ఉన్న బ్రిడ్జికి సమీపంలో రంధ్రాలు పడ్డాయని గ్రామస్తులు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. మూడు రోజుల నుంచి బస్సులు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దీంతో ఆదివారం రామసుబ్బారెడ్డి నెమళ్లదిన్నె బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి సమీప ప్రదేశంలో రంధ్రం పడటంతో దానికి మరమ్మతులు చేయించాలని ఆర్అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్సీ సూచించారు. అయితే ప్రస్తుతం పండుగ సందర్భంగా సెలవులు ఉన్నాయని, తర్వాత చేస్తామంటూ డీఈ తెలిపారు. అధికారుల నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఆయన.. ఎగువ భాగాన ఉన్న జంగాలపల్లి, బలపనగూడురు, ఉప్పలపల్లి, జె.కొట్టాలపల్లి గ్రామాలకు చెందిన ఆరు వేల జనాభాకు రాకపోకలకు అంతరాయం కలగడంతో వెంటనే రంధ్రాలను పూడ్చాలని స్థానిక నేతలను ఆదేశించారు. దీంతో స్థానిక నేతలు జంగాలపల్లి వీరారెడ్డి, నెమళ్లదిన్నె సుదర్శన్‌రెడ్డి, సురేష్, శంకర్, బలపనగూడురు రామచంద్రారెడ్డి వెంటనే పొక్లెయిన్ తెప్పించి పనులు ప్రారంభించారు. రంధ్రాలను పూర్తిగా పూడ్చిన తర్వాత స్థానిక ఎస్ఐ సుబ్బారావు అక్కడికి చేరుకుని పనులు ఎవరు చేయమన్నారంటూ ప్రశ్నించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ స్థానిక నేతలకు హుకుం జారీ చేశారు. అప్పటికే పనులు పూర్తి కావడంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు కూడా సంఘటన స్థలం నుంచి వెనుదిరిగారు.

చేసిన పనులనే మళ్లీ చేసి..

నెమళ్లదిన్నె బ్రిడ్జి వద్ద ఎమ్మెల్సీ పనులు చేయిస్తున్న విషయం తెలుసుకున్న కూటమి నేతలు.. వైఎస్సార్ సీపీ నాయకులకు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో వెంటనే పోలీసులను పంపించి పనులు ఆపాలని ప్రయత్నం చేశారు. అయితే గత కొన్ని నెలలుగా పట్టించుకోని కూటమి నేతలు.. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. మళ్లీ మేము చేస్తామంటూ వితండవాదం చేస్తూ మరో పొక్లయిన్ తెప్పించి పనులు చేస్తున్నట్లు ఫోజులు ఇచ్చారు. ఏదిఏమైనా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి రాకవల్ల రోడ్డు బాగు పడిందని, రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గోపూజ, గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి, కాలక్షేప మండపంలోని కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి



ఎన్నికైన సంఘం నాయకులను సత్కరిస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

కడప రూరల్ : వడ్డెర సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో వడ్డెర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నూతన కార్యవర్గం సమావేశం జిల్లా గౌరవ అధ్యక్షులు బాలకొండయ్య, రమణయ్య ఆధ్వర్యంలో జరగ్గా.. నూతన జిల్లా అధ్యక్షులుగా చంద్రగిరి నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాయచోటి వెంకటసుబ్బయ్య (కమలాపురం)లను ఎన్నుకున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వడ్డెర్లను వాడుకుని తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించడం జరుగుతోందన్నారు. ఈ కారణంగా తరతరాలుగా వడ్డెర్లు ఎలాంటి అభ్యున్నతికి నోచుకోలేదన్నారు. ముఖ్యంగా చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేకపోవడంతో తమ సమస్యలు పట్టించుకునే నాథుడే లేరన్నారు. ముఖ్యంగా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని సుదీర్ఘ కాలంగా పోరాడుతున్నా పాలకులకు పట్టడం లేదని తెలిపారు. ఈ క్రమంలో తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి నియోజకవర్గాల, మండలాల నూతన కమిటీలు ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా యువజన, మహిళ, ఉద్యోగ సంఘాలతోపాటు ఇతర విభాగాల్లో నియామకాలు చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. భవిష్యత్తులో సమస్యల పరిష్కారానికి పోరాటాలే లక్ష్యంగా ముందుకు సాగుతూ నిర్దేశించుకున్న డిమాండ్లను సాధించగలమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, వడ్డెర కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

19 మంది మందుబాబుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 19 మందిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం డ్రోన్ ద్వారా ప్రొద్దుటూరు శివారు ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రింగు రోడ్డు పరిసర ప్రాంతాలు, దొరసానిపల్లె, రెండు కుళాయిలు, ఖాళీ వెంచర్లలో డ్రోన్ కెమెరాతో విస్తృతంగా గాలించారు. అక్కడ మద్యం తాగుతున్న 19 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రోన్ ఆపరేషన్‌లో రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, కేసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారమే సీజేఐపై దాడి


మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి చంద్ర కుమార్


సదస్సులో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు, ప్రజలు

- మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలనుకుంటున్నారు
- రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉంది
- హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్

కడప కార్పొరేషన్ : న్యాయవ్యవస్థను గుప్పిట్లో పెట్టుకోవడానికి పక్కా ప్రణాళిక ప్రకారమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాదులు దాడి చేశారని హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ఆరోపించారు. ఆదివారం పాతరిమ్స్ ప్రాంగణంలోని బీసీ భవన్‌లో కడప పౌర సమాజం ఆధ్వర్యంలో 'సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిని ఖండిద్దాం– రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' పేరుతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భారత రాజ్యాంగ మూల స్తంభాలపై జరిగిన దాడిగా దీన్ని చూడాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పౌర సమాజంపై ఉందన్నారు. పెద్ద కుట్రలో భాగంగానే సీజేఐపై ఈ దాడి జరిగిందన్నారు. మనువాదాన్ని, మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. దేశంలో జరుగుతున్న అవినీతి, దోపిడీ, రైతులు, నిరుద్యోగులు పడుతున్న ఇబ్బందుల నుంచి పక్కదోవ పట్టించడానికి ఇలాంటివి చేస్తున్నారన్నారు. దేశంలో అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తిపై దాడి చేశారంటే.. మన సమాజంలో కులతత్వం, మతతత్వం ఎంత లోతుగా పాతుకుపోయిందో, ఇది ఎంత ప్రమాదకర సంఘటనో తెలియజేస్తుందన్నారు. జ్ఞానానికి కులం లేదని, సమానత్వమే ప్రధాన ధర్మమని రాజ్యాంగం చెప్పిందన్నారు. మూఢ నమ్మకాలు, కులవ్యవస్థకు వ్యతిరేకంగా అన్నమయ్య, వివేకానందుడు, వేమన, వీరబ్రహ్మంలాంటి వారు ఆనాడే గళం విప్పారని గుర్తు చేశారు.

సనాతన ధర్మ ముసుగులో దాష్టీకాలు

సనాతన ధర్మం ముసుగులో జరుగుతున్న దాష్టీకాలపై ప్రజలను చైతన్య పరచడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామని ప్రముఖ న్యాయవాది ఏ.సంపత్ కుమార్ అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేయడం ద్వారా దేశంలో ఒక భయానక పరిస్థితిని కల్పించారన్నారు.

ప్రజాస్వామ్య మనుగడకు ప్రమాదం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి ప్రజాస్వామ్య మనుగడకు ఎంతో ప్రమాదకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడినందుకు దేవుడే తనతో ఈ దాడి చేయించారని రాకేష్ కిషోర్ చెప్పడం దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తుల హింసా రాజకీయాలకు ఇది పరాకాష్ఠ అన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాలరాసేందుకు కుట్ర

భారత రాజ్యాంగాన్ని కాలరాసి, మతోన్మాదాన్ని, కులోన్మాదాన్ని ప్రేరేపించేందుకు కుట్ర జరుగుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన ప్రధాని నరేంద్రమోదీ ఏకతా వాదాన్ని తెరపైకి తెస్తూ సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానని చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాఘవరెడ్డి, బీఎస్పీ నాయకులు సగిలి గుర్రప్ప, డాక్టర్ మల్లేల భాస్కర్, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు వెంకట శివ, రామ్మోహన్, రఘునాథరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కుమారస్వామి, ఎన్‌జీవో నాయకులు రాజశేఖర్, శ్రీనివాసులు, ప్రజా సంఘాల నాయకులు అవ్వారు మల్లికార్జున, కేవీ రమణ, విశ్వనాథ్, లక్ష్మిరాజ, సంగటి మనోహర్, డీఎం ఓబులేసు, కె. శ్రీనివాసులరెడ్డి, సుబ్రమణ్యం, జేవీ రమణ, నాగసుబ్బారెడ్డి, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త యాడ్ బోర్డుల కోసం ఈఓఐ పద్ధతిలో టెండర్లు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో కొత్త యాడ్ బోర్డులు ఏర్పాటు చేయుటకు ఈఓఐ పద్ధతిలో టెండర్లు పిలవడం జరిగిందని నగరపాలక కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19వ తేదీన సాక్షిలో ప్రచురితమైన ‘మనోడే.. ఫ్రీగా ఇచ్చేయ్’ కథనంపై ఆయన స్పందించారు. లీడ్ స్పేస్ ఏజెన్సీతో బీఓటీ పద్ధతిలో 2019లో 15 ఏళ్ల కాలానికి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయుటకు ఒప్పందం కుదిరిందన్నారు. ఆ ఒప్పందం ప్రకారం కార్పొరేషన్ గుర్తించిన ప్రదేశాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. బదులుగా కార్పొరేషన్ అంగీకరించిన ప్రకారం కొన్ని ప్రదేశాలలో ప్రకటనల హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకునే అవకాశం ఇచ్చామన్నారు. భవిష్యత్‌లో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన ప్రదేశాలు గుర్తించినట్లయితే.. అవసరమైన చోట్ల ప్రకటనల హోర్డింగుల కోసం అదనపు అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. కలెక్టర్‌తో ఈ నెల 15న జరిగిన సమావేశంలో ఈ పనులకు అవసరమైన నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద నిధులు మంజూరు చేసి, ఈ ప్రతిపాదనను ప్రస్తావించడం జరిగిందన్నారు. ఈ అదనపు ప్రకటన హక్కులు మంజూరు చేసే ప్రతిపాదనను నగరపాలక మండలి తిరస్కరించి, తిరిగి వచ్చే సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలపడం జరిగిందన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థిని దుర్మరణం

పుల్లంపేట : మండల పరిధిలోని రాజుగారిపల్లికి చెందిన విద్యార్థిని మానస(17) విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందింది. ఆ బాలిక ఇంటర్మీడియెట్ చదువుతుండేది. ఆదివారం ఇంట్లో స్విచ్ ఆన్ చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మానస మృతదేహాన్ని మాజీ మండలాధ్యక్షురాలు ముద్దా పెద్ద విజయమ్మ, మండలాధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి, స్థానిక నాయకులు కుమార్‌రెడ్డిలు సందర్శించి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మానస మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఏపీ అంటే అమరావతి, పోలవరమా?


కోటి సంతకాల సేకరణ పత్రాలు అందజేస్తున్న సురేష్‌బాబు, ఆకేపాటి సోదరులు

రాజంపేట రూరల్ : ఏపీ అంటే అమరావతి, పోలవరం అనే విధంగా సీఎం చంద్రబాబు పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కొత్తమద్ది సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రూరల్ పరిధిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా పరిశీలకులు కొత్తమద్ది సురేష్‌బాబు, జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొని మండల పరిధిలోని నాయకులు, కార్యకర్తలకు కోటి సంతకాల సేకరణపై దిశా నిర్దేశం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతోపాటు జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న పథకాలన్నింటిని అమలు చేస్తామని కూటమి నాయకులు ప్రజలను మభ్య పెట్టారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం అపసోపాలు పడుతోందని ఎద్దేవా చేశారు. తమ సామాజిక వర్గానికి మేలు చేసేందుకు అమరావతికి వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను అమలు చేయక పోగా.. నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకున్నారని దుయ్యబట్టారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయనీయబోమని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆశా దీపంగా నిలుస్తున్న మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయటం సరికాదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి సంతకాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేపటి మన బిడ్డల భవిష్యత్ కోసం మనం వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన అవసరం


సురక్ష యాప్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్

రాజంపేట : ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్ తెలిపారు. రాజంపేటలో పలు మద్యంషాపులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 122 మద్యం షాపులు, 11 బార్లను క్షుణ్ణంగా తనిఖీలు చేశామన్నారు. ప్రతి షాపులో ప్రభుత్వం సరఫరా చేసిన మద్యం మాత్రమే ఉందన్నారు. నకిలీ మద్యం ఎక్కడా లేదన్నారు. నకిలీ మద్యం అమ్మితే ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా ఇట్టే పసిగట్టవచ్చునన్నారు. ఒక వేళ ఎక్కడైనా మద్యం అమ్మిన బాటిల్ కన్స్యూమర్ పోర్టల్‌లో వివరాలు రాకపోయినా, మద్యం బాటిల్ అనుమానాస్పదంగా ఉన్న వెంటనే స్థానిక ఎక్సైజ్ అధికారులు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (7981216391)ను సంప్రదించాలన్నారు. వాట్సాప్‌లో ఆ బాటిల్ ఫొటో పంపిన తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 1,11,628 మద్యం సీసాలను స్కాన్ చేసి అమ్మడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లిక, ఎస్ఐ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.